క్లుప్తంగా

పేదల సంక్షేమం బీజేపీతోనే సాధ్యం



చారకొండ: పేదల సంక్షేమం బీజేపీతోనే సాధ్యమని బీజేపీ మహిళ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి లావణ్య అన్నారు. ఆదివారం మండల కేంద్రంతో పాటు శాంతి గూడెంలో పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. పేదలను దృష్టిలో ఉంచుకొని ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఉచిత బియ్యం అందిస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఎస్సీ మోర్చా కార్యవర్గ సభ్యులు మోగిల్ల కన్నా, మండల ప్రధాన కార్యదర్శి కిరణ్ గౌడ్, ఓబీసీ మండల అధ్యక్షుడు పవన్ కుమార్, నాయకులు అనిల్, రఘు ఉన్నారు.

ఉత్సవాలపై అభిప్రాయాల సేకరణ

కొల్లాపూర్: పట్టణంలోని వాసవీ కన్యకా పరమేశ్వరి కల్యాణ మండపంలో ఆర్ఐడీ పాఠశాల, కళాశాల పూర్వ విద్యార్థులు ఆదివారం సమావేశం అయ్యారు. నవంబర్ 27వ తేదీ నుంచి 29వ తేదీ వరకు నిర్వహించే సమ్మేళనం కార్యక్రమంపై పూర్వ విద్యార్థులు అభిప్రాయాలను సేకరించారు. ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించేందుకు తమవంతు సలహాలు ఇచ్చారు. పూర్వ విద్యార్థులు తప్పనిసరిగా కార్యక్రమానికి హాజరుకావాలని కోరారు. సమావేశంలో జూపల్లి జగన్మోహన్‌రావు, న్యాయవాది శ్రీనివాసరావు, ఎత్తం శ్రీనివాసరావు, కటికనేని సాయి, రాజేశ్వరి, కట్టా శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

డీఏపై ఉద్యోగులు అసంతృప్తి

బిజినేపల్లి: ప్రభుత్వ ఉద్యోగులకు ఐదు డీఏలు పెండింగ్‌లో ఉండగ దీపావళి కానుకగా ఒక డీఏను మాత్రమే ప్రకటించడంతో ఉద్యోగులు అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆదివారం తిమ్మాజిపేట మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు ప్రదీప్, హుస్సేని మాట్లాడారు. అధికారంలోకి వచ్చిన పదిహేను రోజుల్లో బకాయి పడిన మూడు వాయిదాల డీఏను విడుదల చేస్తామని మేనిఫెస్టోలో పెట్టి ఇప్పుడు ఒకటే డీఏ ఇవ్వడం సరికాదన్నారు. సమావేశంలో వెంకటేష్, ఇబ్రహీం, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

వర్గీకరణ అమలు చేయాలి

కొల్లాపూర్ రూరల్: రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణను వెంటనే అమలు చేయాలని దండోరా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోళ్ల శివ మాదిగ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. వర్గీకరణ చట్టం అమలు కాకుండా కాంగ్రెస్ మాల ఎమ్మెల్యేలు అడ్డదారిలో అడ్డుకోవడానికి ప్రయత్నాలు చేస్తున్నారన విమర్శించారు. అందులో భాగంగానే మాలల ఆత్మగౌరవ సభల పేరుతో ప్రభుత్వంపై వత్తిడి తెచ్చేందుకు కుట్రపన్నారన్నారు.

దాడిచేసిన వ్యక్తిని శిక్షించాలి



వెల్దండ: మండలంలోని రాచూర్ గ్రామానికి చెందిన వీఓఏగా విధులు నిర్వహిస్తున్న హైమావతిపై శనివారం రాత్రి దాడిచేసిన వారిపై చర్యలు తీసుకోవాలని మండల వీఓఏల సంఘం ఆధ్వర్యంలో ఆదివారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. గ్రామంలో మహిళ సంఘాల సభ్యులతో వీఓఏ హైమావతి మాట్లాడుతుండగా అదే గ్రామానికి చెందిన సంఘం సభ్యురాలు వెంకటమ్మ భర్త గంగాధరి కృష్ణయ్య అసభ్యకరంగా మాట్లాడుతూ వీఓఏపై కర్రలతో దాడికి పాల్పడ్డాడు. అకారణంగా దాడికి పాల్పడిన వ్యక్తిపై కేసు నమోదు చేయాలని వీఓఏ కోరారు. వీఓఏల సంఘం జిల్లా అధ్యక్షురాలు సుమలత, ఏపీఎం రాములు, సెర్ప్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర నాయకులు యాదగిరి, జిల్లా కమిటీ సభ్యులు చంద్రశేఖర్, రామస్వామి, జంగయ్య, మండల అధ్యక్షులు జంగమ్మ, వసంత, మణిపాల్, జహేదా, సీసీలు, వీఓఏలు తదితరులు ఉన్నారు.

ఘన సన్మానం

కల్వకుర్తిరూరల్: గెస్ట్ లెక్చరర్ అసోసియేషన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నియామకం అయిన సదానందంగౌడ్‌ను ఆదివారం పట్టణంలోని విద్యానగర్‌లో ఆయన నివాసంలో బీజేపీ జిల్లా నాయకుడు గుర్రాల రాంభూపాల్‌రెడ్డి సన్మానించారు. మాజీ జెడ్పీటీసీ బాలస్వామిగౌడ్, శేఖర్‌గౌడ్, శేఖర్‌రెడ్డి, నారాయణగౌడ్, ఎల్లయ్యగౌడ్ తదితరులు ఉన్నారు.



దారి పొడవునా పిచ్చిమొక్కలు

- ఎదురుగా కన్పించని వాహనాలు
- పట్టించుకోని అధికారులు

పెద్దకొత్తపల్లి: మండలంలోని వివిధ గ్రామాలకు వెళ్లే బీటీ రోడ్లకు ఇరువైపులా పిచ్చి మొక్కలు పెరిగి ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక ప్రమాదాలు జరుగుతున్నాయి. ఆర్అండ్‌బీ అధికారుల నిర్లక్ష్యం వల్ల ఈ మొక్కలను తొలగించకపోవడంతో రాత్రి సమయంలో ప్రమాదాలు సంభవిస్తున్నాయి. మండలంలోని పెద్దకొత్తపల్లి నుంచి పసుపుల, కోడేరుకు వెళ్లే బీటీ రోడ్డు పెద్దకొత్తపల్లి నుంచి నక్కలపల్లికి వెళ్లే కస్తూర్బా రోడ్డు, ఈగలపల్లి నుంచి యాపట్ల క్రాస్ రోడ్డు వరకు ముష్టిపల్లి నుంచి పెద్దూరుకు వెళ్లే బీటీ రోడ్డు, చంద్రకల్ నుంచి గౌరిదేవిపల్లి, మర్రికల్ నుంచి పెద్దకార్పాముల రోడ్డు, పెద్దకొత్తపల్లి నుంచి అంబడికి వెళ్లే రోడ్డు, సాతాపూర్ నుంచి మారేడుమాన్‌దిన్నె రోడ్డు, కల్వకోల్ నుంచి కోడేరు వెళ్లే రోడ్లు ఇరువైపుల పిచ్చి మొక్కలతో నిండి వాహనదారులు ఇబ్బందులు కల్పిస్తున్నాయి.



దేవల్‌తిరుమలాపూర్ బీటీ రోడ్డుకు ఇరువైపులా పెరిగిన పిచ్చి మొక్కలు

నిధులు రావడం లేదు

గ్రామ పంచాయతీలకు కేంద్ర ప్రభుత్వ నిధులు రాకపోవడంతో అభివృద్ధి పనులు చేపట్టలేకపోతున్నాం. నిధులు మంజూరైన వెంటనే రోడ్లకు ఇరువైపుల పిచ్చి మొక్కలను తొలగిస్తాం. పిచ్చిమొక్కలు పెరిగి వాహనదారులు ఇబ్బందులు పడుతున్నది వాస్తవమే.

– నాగేందర్ ఎంపీడీఓ పెద్దకొత్తపల్లి

గ్రామాల్లో మౌలిక వసతులు కల్పిస్తాం

లింగాల: నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో మౌలిక వసతులు కల్పిస్తామని ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ అన్నారు. మండలంలోని అవుసలికుంటలో ఆదివారం కాంగ్రెస్ పార్టీకి చెందిన ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పార్టీ శ్రేణులను ఉద్దేశించి మాట్లాడారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలో గ్రామాల సమగ్ర అభివృద్ధి చర్యలు తీసుకుంటున్నామన్నారు. పాఠశాలలు, అంగన్‌వాడీ, పంచాయతీలకు స్వంత భవనాలు, రోడ్డు, రవాణా సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఎమ్మెల్యే పార్టీ శ్రేణులకు సూచించారు. సమావేశంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



అచ్చంపేట రూరల్: పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో 2005–06 విద్యా సంవత్సరంలో పదో తరగతి పూర్తి చేసిన పూర్వ విద్యార్థినులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఒకరికొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. విద్యార్థినులు గత జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. అనంతరం అప్పటి గురువులను సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు అనసూయదేవి, వీరబ్రహ్మం, కృష్ణయ్యగౌడ్, భారతి, అనిత, మధు, కవితాకుమారి, సుజాత పాల్గొన్నారు.

చెట్ల తొలగింపు



వెల్దండ: మండలంలోని పోతేపల్లి రోడ్డుకు ఇరువైపులా చెట్లను ఆదివారం మాజీ సర్పంచ్ ఎడ్మ వెంకటరెడ్డి సహకారంతో తొలగించారు. పోతేపల్లి–తాండ్ర రోడ్డుకు ఇరువైపులా చెట్లు పెరగడంతో ఎదురుగా వచ్చే వాహనాలు కన్పించడంలేదు. వాహనదారులకు ఇబ్బందులు లేకుండా సొంతఖర్చులతో వెంకట్‌రెడ్డి చెట్లను తొలగించినట్లు గ్రామస్తులు పేర్కొన్నారు.

కరపత్రాలు విడుదల



తాడూరు: మండలంలోని చర్లిటిక్యాలలో ఆదివారం చిన్నజీయర్ స్వామి తిరు నక్షత్ర ఉత్సవాల కరపత్రాలను ఆవిష్కరించారు. విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో చిన్నజీయర్‌స్వామి తిరునక్షత్ర ఉత్సవాలపై వీహెచ్‌పీ సభ్యులు అవగాహన కల్పించారు.

గ్యాస్ సిలిండర్ పేలి పూరిగుడిసె దగ్ధం

ఉప్పునుంతల: మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో ఆదివారం గుమ్మకొండ బాల్‌లక్ష్మయ్య ఇంట్లో ప్రమాదవశాత్తు గ్యాస్ సిలిండర్ పేలి పూరిగుడిసె పూర్తిగా కాలిపోయింది. ఈ ప్రమాదంలో గుడిసెలోని బియ్యం, ఇతర వస్తువులు కాలి రూ. 30 వేల వరకు ఆస్తినష్టం సంభవించింది. స్థానికుల వివరాల ప్రకారం బాధితుడు బాల్‌లక్ష్మయ్య భార్యాపిల్లలతో బంధువుల ఇంటికి వెళ్లాడు. ఇంటివద్ద అతని చిన్నమ్మ లక్ష్మమ్మ ఉంది. ఆమె నీటిని వేడిచేసుకొని స్టవ్ ఆఫ్ చేయకుండా బయటకు వెళ్లింది. కొంతసమయం తర్వాత పెద్ద శబ్దంతో సిలిండర్ పేలింది. పక్కనే ఉన్న మరో సిలిండర్‌కు మంటలు అంటుకోవడంతో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ప్రమాద సమయంలో గుడిసెలో ఎవరు లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. సమాచారం అందుకున్న ఫైర్ సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకొని మంటలు ఆర్పివేశారు. గుడిసెలో ఉన్న బియ్యం, ఇతర పాత్రలు, ఇతర వస్తువులు పూర్తిగా కాలిపోయాయి. ప్రభుత్వం బాధిత కుటుంబానికి ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.

సింగిల్‌విండో కార్యాలయంలో ప్రత్యేక పూజలు



తాడూరు: మండల కేంద్రంలోని సింగిల్‌విండో కార్యాలయంలో నూతనంగా నిర్మించిన కార్యాలయ ఆవరణలో విండో చైర్మన్ రామచంద్రారెడ్డి, వైస్ చైర్మన్ వెంకట్‌రెడ్డిల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. భక్తిశ్రద్ధలతో హోమం, వ్రతాలు నిర్వహించారు.

నేడు భవనం ప్రారంభం

సింగిల్ విండో భవనంతోపాటు కొత్తగా నిర్మించిన ఫంక్షన్‌హాల్‌ను సోమవారం ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డి ప్రారంభిస్తారని విండో చైర్మన్ రామచంద్రారెడ్డి తెలిపారు. ఎంపీ మల్లురవి, ఎమ్మెల్సీ దామోదర్‌రెడ్డి, పీసీసీబీ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డిలు హాజరవుతారని పేర్కొన్నారు.

విద్యార్థుల సంక్షేమంపై ప్రత్యేక శ్రద్ధ

లింగాల: విద్యార్థుల సంక్షేమంపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటుందని హెచ్‌డబ్ల్యూఓ శివయ్య అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని బీసీ సంక్షేమ శాఖ బాలుర వసతి గృహంలో విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్‌డబ్ల్యూఓ మాట్లాడుతూ వసతి గృహాల్లో అన్ని రకాల సౌకర్యాలను కల్పిస్తుందని తెలిపారు. పిల్లలను తప్పని సరిగ్గా వసతి గృహంలోనే ఉండేటట్లు తల్లిదండ్రులు ప్రోత్సహించాలని కోరారు. వసతి గృహంలో ఏమైన ఇబ్బందులు ఉంటే తెలపాలని కోరారు. కార్యక్రమంలో భోజ్యా నాయక్, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎస్‌ఐని కలిసిన కాంగ్రెస్ నాయకులు



చారకొండ: మండలానికి ఇటీవల నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఎస్‌ఐ శంషుద్దీన్‌ను ఆదివారం మండలంలోని సిర్సనగండ్ల కాంగ్రెస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపి సన్మానించారు. శాంతిభద్రతల పరిరక్షణకు రాజకీయపార్టీ నాయకులు సహకరించాలని ఎస్‌ఐ కోరారు. కార్యక్రమంలో సురేందర్ రెడ్డి, సందీప్ రెడ్డి, రమేష్ రెడ్డి, సిద్దార్థ రెడ్డి, చెన్నయ్య, నల్లా రాజు తదితరులు ఉన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

చారకొండ: మండలంలోని రామచంద్రాపురంలో గ్రామానికి చెందిన జంతుక సైదులు ఆదివారం అనారోగ్యంతో మృతి చెందాడు. బాధిత కుటుంబానికి గ్రామ అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో రూ.10 వేల ఆర్థిక సాయం అందజేశారు. జె. వెంకటయ్య, గ్రామస్తులు ఉన్నారు.



వేణుగోపాలస్వామి దేవస్థాన అధ్యక్షుడిగా శేఖర్



మన్ననూర్: స్థానిక వేణుగోపాలస్వామి దేవస్థాన నూతన అధ్యక్షుడిగా పులిజాల శేఖర్‌ను గ్రామస్తులు, మహిళలు, యువకుల సమక్షంలో ఎన్నుకున్నారు. అనంతరం నూతన అధ్యక్షుడు శేఖర్‌ను సన్మానించారు. ఈ సందర్భంగా శేఖర్ మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. త్వరలోనే పూర్తిస్థాయి కమిటీని ఎన్నుకుంటామన్నారు. కార్యక్రమంలో పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ ప్రారంభం



తెలకపల్లి: మండల కేంద్రానికి చెందిన స్వామిగౌడ్ ట్రాన్స్‌ఫార్మర్‌కు దరఖాస్తు చేసుకున్నాడు. నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లురవి, ఎమ్మెల్యే కూచుకుళ్ల రాజేష్‌రెడ్డి స్పందించి ట్రాన్స్‌ఫార్మర్ త్వరితగతిన మంజూరు చేయించారు. ఆదివారం మంజూరైన ట్రాన్స్‌ఫార్మర్‌ను విండో వైస్ చైర్మన్ యాదయ్య ప్రారంభించారు. స్వామి, శివ, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి పోటీలకు విద్యార్థి ఎంపిక



తెలకపల్లి: మండల కేంద్రంలోని శాంతినికేతన్ పాఠశాలకు చెందిన విద్యార్థి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఆ పాఠశాల కరస్పాండెంట్‌లు ఇంద్రకుమార్, సురేందర్‌రావు తెలిపారు. పాఠశాలకు చెందిన వరప్రసాద్ ఆదివారం డివిజన్ స్థాయికి సంబంధించిన కబడ్డీ పోటీలలో నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో ప్రతిభ కనబర్చారు. దీంతో జిల్లా స్థాయికి ఎంపికైనట్లు పేర్కొన్నారు.

ఎస్సీ కార్పొరేషన్ రుణాలు అందజేయాలి



తాడూరు: నిరుద్యోగులకు ఎస్సీ కార్పొరేషన్ రుణాలు అందజేయాలని ఇంటర్‌నేషనల్ హ్యూమెన్‌రైట్స్ జిల్లా ఉపాధ్యక్షుడు కొత్త బాలు డిమాండ్ చేశారు. ఆదివారం మండలంలోని శిర్సవాడలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వం దళితబంధు పేరుతో దళితులను దగా చేసిందని వాపోయారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ఇచ్చిన హామీలు నెరవేర్చాలన్నారు. కార్పొరేషన్ ద్వారా రుణాలు ఇవ్వని పక్షంలో పెద్ద ఎత్తున ప్రజా సంఘాల ద్వార ఆందోళన కార్యక్రమం చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో హ్యూమెన్ రైట్స్ సభ్యులు భగవంత్, సాంబులు, వెంకటయ్య, నర్సింహులు పాల్గొన్నారు.

రహదారికి మరమ్మతు



బిజినేపల్లి: నాగర్‌కర్నూల్ నుంచి జడ్చర్లకు వెళ్లే ప్రధాన రహదారి గుంతలమయంగా మారింది. దీంతో మద్యం వ్యాపారులు చందాలు వేసుకుని ఆదివారం రోడ్డుపై ఉన్న గుంతలను పూడ్చి చదును చేశారు. వర్షాల కారణంగా రహదారులు దెబ్బతిన్నాయి. అధికారులు స్పందించకపోవడంతో మద్యం వ్యాపారులు చందాల వేసుకొని మరమ్మతు పనులు చేపట్టారు.

ఆత్మగౌరవ సభకు తరలిన మాలలు

సాక్షి, నెట్‌వర్క్: నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో ఆదివారం నిర్వహించిన మాలల ఆత్మగౌరవ సభకు జిల్లా వ్యాప్తంగా మాలలు తరలివెళ్లారు. కొల్లాపూర్, తెలకపల్లి, పెద్దకొత్తపల్లి, తాడూరు, ఊర్కొండ, లింగాల, చారకొండ మండల కేంద్రాలతో పాటు పలు గ్రామాల నుంచి వాహనాలలో బయలుదేరి వెళ్లారు. ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అంతకుముందు మండలాల్లో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.



ఊర్కొండలో అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు

రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న స్వయం సేవకులు

వెల్దండ: రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ ఏర్పడి 100 ఏళ్ల పూర్తి కావడంతో ఆదివారం మండలం కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా స్వయం సేవక్ జిల్లా వక్త శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ దేశ ఐక్యత కోసం హిందువులు ఏకం కావాలన్నారు. హిందు మతంపై జరుగుతున్న దాడులను ప్రతి ఒక్కరు ఖండించాలన్నారు. ఆర్ఎస్ఎస్ నిరంతరం దేశ సేవ కోసం పనిచేస్తుందన్నారు. అనంతరం గ్రామంలోని ప్రధాన వీధుల గుండా ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు పదచలన్ నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు, సంఘ్ సభ్యులు తదితరులు ఉన్నారు.

ప్రైవేటు ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

అచ్చంపేట రూరల్: ప్రైవేటు పాఠశాలలో విధులు నిర్వర్తించే ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని టీపీటీఎఫ్ జిల్లా కమిటీ నాయకులు ఊశన్న, పర్వతాలు, అజాహర్ కోరారు. ఆదివారం పట్టణంలో టీపీటీఎఫ్ అచ్చంపేట డివిజన్ స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించడంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమన్నారు. అనంతరం గుర్తింపు కార్డులను అందజేశారు. డీఎస్సీ గురుకులంలో ప్రభుత్వ ఉద్యోగం పొందిన రవినాయక్, బాబయ్య, జ్యోతి, మల్లేష్‌ను సన్మానించారు. కార్యక్రమంలో అశోక్, కుమార్, జేమ్లా, భాస్కర్, కుర్మయ్య, రాంరెడ్డి, ఎల్లయ్య, ఈసా, వెంకటేష్, అంజి, లింగమయ్య, రేణయ్య, ప్రశాంత్‌నాయక్ పాల్గొన్నారు.



సన్మానిస్తున్న టీపీటీఎఫ్ నాయకులు

సగర సంఘం నూతన కమిటీ ఎన్నిక

అచ్చంపేట రూరల్: పట్టణంలోని ఆర్అండ్‌బీ అతిథి గృహం ఆవరణలో ఆదివారం సగర సంఘం పట్టణ కమిటీని సంఘం జిల్లా అధ్యక్షుడు గట్టు శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శి వేముల సుధాకర్ ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా చిలక రాములు, అధ్యక్షుడిగా చంచెట్టి సూర్యనారాయణ, ఉపాధ్యక్షుడిగా గుంటే కృష్ణ, ప్రధాన కార్యదర్శిగా శ్రీనివాసులు, కోశాధికారిగా గంగాపురం రాము, సహాయ కార్యదర్శిగా మండల రాజు, ప్రచార కార్యదర్శులుగా గుంతి తిరుపతయ్య, మాదంశెట్టి యాదయ్య, కార్యవర్గ సభ్యులుగా వేణు, మహేష్, కృష్ణయ్య, నిరంజన్, గోపాల్, బాలకృష్ణయ్య, వెంకటయ్య, నరేష్, సాయిబాబా, మధులు ఎన్నికయ్యారు. కార్యక్రమంలో మాదంశెట్టి వెంకటయ్య, భాష పాల్గొన్నారు.

బ్రిడ్జి నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేయాలి

కొల్లాపూర్ రూరల్: మండలంలోని ముక్కిడిగుండం గ్రామ ప్రధాన రహదారిపై పెద్ద వాగులో నిర్మిస్తున్న హైలెవల్ బ్రిడ్జి నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేయాలని గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు అశోక్ నాయక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన ముక్కిడిగుండం గ్రామంలో తండావాసులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి సంవత్సరం వర్షాకాలంలో ముక్కిడిగుండం, తండాలవారు పెద్ద వాగు ఉధృతంగా ప్రవహించడంతో రాకపోకలకు ఇబ్బందులు ఎదుర్కొంటారన్నారు. అధికారులు స్పందించి నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలని కోరారు. కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు, తండాల వాసులు ఉన్నారు.

వ్యవసాయ కమిషన్ సభ్యుడికి సన్మానం

చారకొండ: ఇటీవల రాష్ట్ర వ్యవసాయ కమిషన్ సభ్యుడిగా ఎంపికైనా కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు కేవీఎన్ రెడ్డిని మండలంలోని జూపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు కొండారెడ్డిపల్లిలో వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపి సన్మానించారు. కార్యక్రమంలో మండల నాయకులు సత్తూరి శ్రీనివాస్ గౌడ్, నరేష్, సిరాజ్, అన్వర్‌పాషా తదితరులు ఉన్నారు.

కల్వకుర్తిరూరల్: రాష్ట్ర వ్యవసాయ శాఖ కమిషన్ సభ్యుడిగా పదవి బాధ్యతలు స్వీకరించిన కే వెంకట్‌నర్సింహారెడ్డిని ఆదివారం ఆయన స్వగృహంలో లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో శాలువాతో సత్కరించారు. క్లబ్ అధ్యక్షుడు కల్మిచర్ల రమేష్, కార్యదర్శి శ్రీను, కృష్ణయ్య తదితరులు ఉన్నారు.

గుంతను పూడ్చండి



పెద్దకొత్తపల్లి: పట్టణంలోని మసీదు పక్కన ఉన్న వీధిలో తాగునీటి పైపులైన్ మరమ్మతు కోసం 15 రోజుల కిందట రోడ్డు మధ్యలో గ్రామ పంచాయతీ సిబ్బంది గుంత తీసి వదిలేశారు. ఈ రోడ్డు వెంట వెళ్లే వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. గ్రామ పంచాయతీ వారు వెంటనే గుంతను పూడ్చాలని కాలనీవాసులు కోరారు.

పల్లె దవాఖానకు సుస్తీ

మన్ననూర్: గ్రామీణ ప్రజల ఆరోగ్యం కోసం గతంలో అమ్రాబాద్ మండలం వెంకటేశ్వర్లబావిలో పల్లె దవాఖానను నిర్మించారు. కాని ఎప్పుడు తెరుస్తారో ఎప్పుడు మూస్తారో ఎవరికి అంతుపట్టడం లేదు. ఆయుష్ సిబ్బంది పత్తాలేకుండా పోయారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. ఆరోగ్య కార్యకర్త మాత్రం అప్పుడప్పుడు వచ్చి కాలాయాపన చేసి వెళ్తోందని విమర్శలు వినిపిస్తున్నాయి. గ్రామంలో పల్లె దవాఖాన ఎంతో ఆర్భాటంగా ప్రారంభిస్తే ఎంతో సంబురపడ్డామని కాని ఇప్పటికి వైద్యం అందక ఇబ్బంది పడుతున్నామని స్థానికులు వాపోయారు. కొంతకాలంగా పల్లె దవాఖాన తెరుచుకోకపోవడంతో భవనం శిథిలావస్థకు చేరుతోందని పలువురు ఆరోపించారు. ఆపద సమయంలో సమీపంలోని మన్ననూర్, అమ్రాబాద్, అచ్చంపేట ఆస్పత్రులకు వెళ్లక తప్పడం లేదు. సంబంధిత అధికారులు స్పందించి గ్రామంలోని పల్లె దవాఖానాను ప్రతినిత్యం తెరుచుకునేవిధంగా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



వెంకటేశ్వర్లబావిలో పల్లె దవాఖాన

మైసమ్మ జాతరకు భక్తుల రద్దీ



పెద్దకొత్తపల్లి: నాయనోనిపల్లి మైసమ్మ జాతరకు ఆదివారం భక్తులు పోటెత్తారు. జిల్లా నలుమూలల నుంచి భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చి మైసమ్మ దేవతకు నైవేద్యాలు సమర్పించి మొక్కులు చెల్లించారు. టికెట్ల ద్వార రూ.40825లు, హుండీ ద్వార రూ.77 వేలు ఆదాయం సమకూరిందని ఎండోమెంట్ ఈఓ రామేశ్వర శర్మ, మైసమ్మ దేవత ట్రస్ట్ చైర్మన్ శ్రీనివాస్‌యాదవ్ తెలిపారు.